28102024-MAI-04_Layout 1 10/28/2024 2:34 AM Page 1



# చెలిమె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలిసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com



## కొలిమి

కొలిమిప్పుడు
ఏకాంతంలో లేదు
ఒంటరయ్యింది
నాగలి కర్రుల పలకరింపులు లేక
కొడవళ్ల కరచాలనాలు లేక
గడ్డపారల గిలిగింతలు లేక
మౌనంగా రోదిస్తోంది

కొలిమంటే కొలిమి కాదు
కమ్మర్ల గుండెచప్పుడు
రైతన్నకు ప్రాణనేస్తం
ఇంద్రసభ మధ్యలో ఇంద్రుడు ఉన్నట్టు
ఆసాముల మధ్యలో దాకలి ఠీవిగా నిల్చునేది

ఒకటా రెండా
ఊరు ముచ్చట్లన్నీ కొలిమి దగ్గరే
బాధల్లో ఓదార్పునిచ్చేది
సంతోషాన్ని రెట్టింపు చేసేది
ఆసాములకు కొలిమి ఒక కూడలి
కొలిమి ఒక కచ్చేరి

కొలిమి నిండా బూడిద నిండుకుంటే
ఇంటి నిండా ధాన్యం నిండుకునేది
కొలిమి ఎండిపోతే
ఇల్లు ఎండిపోయేది

కాలం కాటేసిందో
ఆధునికత అమాంతం మింగేసిందో
నిరంతరం మంటల భుగభుగలతో
రాజసాన్ని ఒలకబోసిన కొలిమి
నాగలి కర్రుల పలకరింతలతో
నిత్యం సంతోషాన్ని నింపుకున్న కొలిమి
ఈనాడు మూగబోయింది
బూడిదకు చిరునామాగా ఉన్న కొలిమి
ఇప్పుడు బూడిదలో కలిసిపోయింది




ఎన్.నరేశ్ చారి
97013 34516

# పాల్కుర్కి ఎప్పటివాడు..?

తెలుగు సాహిత్య ఆకాశాన ఉజ్జ్వలమణి పాల్కుర్కి సోమన. దీప్తిమంతమైన విశిష్ట వైవిధ్య కవిత్వాన్ని అందించిన మహాకవి. తల్లి శ్రీరమాదేవి, తండ్రి విష్ణురామ దేవుడు. తుముకూరు జిల్లా (కర్ణాటక రాష్ట్రం)లో హాల్కుర్కె తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్ జిల్లాల్లో పాల్కుర్కి గ్రామాలున్నాయి. ఈతని సమాధి ఇక్కడ తెలంగాణలో ఉన్నది. సోమన ఉభయ భాషలలో రచనలు చేసినాడు. ఉభయ రాష్ట్ర వీర శైవులకు పూజ్యుడే.

**పాల్కుర్కి సోమనాథుడు ఏ కాలము వాడన్న విషయంలో భిన్నాభిప్రాయాలున్నాయి. ప్రధానంగా రెండు వాదాలున్నాయి. కాకతీయ వంశమున రుద్రుని కాలము వాడన్న భావనల నుంచి పుట్టినవి ఇవి. ఈ రాజవంశాన రుద్రులిద్దరున్నారు. గణపతిదేవ చక్రవర్తి పెదనాన్న మొదటి రుద్రుడు. రుద్రమదేవి మనుమడు రెండవ ప్రతాపరుద్రుడు.**



వీరి కాలములు 12వ శ.(1132–1198), 14వ శ.(1292–1326) కనుక ఈ ద్వైవిధ్యము ఏర్పడినది. ఈ విషయమున అనేకులైన పండితులు పలు విధాలుగా చెప్పినారు. సీపీ బ్రౌన్, కిట్టేల్, కందుకూరి వంటివారు చెప్పిన కాలానికి కొంత భిన్నత్వాలున్నా వారు ఆధారాలు ఏమీ ఇవ్వలేదు.

వేటూరి ప్రభాకరశాస్త్రి గారు బసవ పురాణ పీఠిక (1926)లో సోమన క్రీ.శ.1132–1198 అని, మల్లంపల్లి సోమశేఖర శర్మ ఒక వ్యాసంలో (1945) అంబదేవుని శాసనం ప్రకారం 1290–1320 అని, నేలటూరి వేంకటరమణయ్య 'పాల్కుర్కి ఎప్పటివాడు' అన్న గ్రంథం (1955)లో 1280–1340 అని, బండారు తమ్మయ్య తన బసవ పురాణ పీఠికలో (తొలి రుద్రునికాలంగా) 1160–1240 అని రాశారు. కొమర్రాజు వారు చేసిన మొదటి రుద్రుని కాలము వాడన్న నిర్ణయంలో కొంత హేతువున్నది.

పాల్కుర్కి సోమనాథుని తెలుగు కవులు (బహుశా వీరశైవ కాఠిన్యత వల్ల) స్మరింపకున్నను, కన్నడ కవి సోమరాజు తన ఉద్భట కావ్యంలో స్మరించినాడు. 'వృషభ స్తవామర మహీజారామనం సోమనం' (అనగా వృషభ శతకం రాసిన సోమనను) అని పేర్కొన్నాడు. ఈతను తన గ్రంథం శా.శ.1144లో రాసినానని చెప్పుకొన్నాడు. ఇది క్రీ.శ.1222. అంటే ఈ కావ్య నిర్మాణానికి ముందే సోమన ప్రసిద్ధుడై ఉన్నాడనేది నిర్వివాదాంశం. ఇది కాల నిర్ణయానికి ప్రధాన సాక్ష్యం.

సోమన రాసిన పండితారాధ్య చరిత్రలో కథానాయకుడైన మల్లికార్జున పండితారాధ్యునకు బెలిదేవి వేమనారాధ్యుడు సమకాలికుడు.

> **'పేరెక్కదగిన శ్రీ బెలిదేవి వేమ నారాధ్యులను పరమారాధ్య దేవు మనుమని శిష్యుండ...' – పండి.చ.**

పండితారాధ్యుడికి (1110–1190) సమకాలికుడైన బెలిదేవి వేమ (1120–1190). (పండితుని సందర్శించిన సమకాలికుడు)నకు కుమారుడు (1140–1200) 20 సంవత్సరాలకు జన్మించినచో. మనుమడు(1160–1220) తర్వాత 20 సంవత్సరాలకు మూడో తరం) వాడగును. ఇతని శిష్యుడు పాల్కుర్కి (3 తరాలు) (గురువునకు పుత్ర సమానం అంటే మరో తరంగా శిష్యుడు) వేమన మనుమడు ఇవటూరి సోమనాథయ్య పాల్కుర్కి సోమనకు గురువు. అనగా సోమునికి పండితారాధ్యుడు, (తరమునకు 20 సంవత్సరాలు X మూడు తరములు) 60 ఏండ్ల ముందువాడు. పండితారాధ్యుని కాలము (మృతి 1170) క్రీ.శ.1100–70 ప్రాంతం కనుక పాల్కుర్కి (1170) పండితారాధ్యుని కాలము అగుటకు అవకాశం ఉన్నది.

బండారు తమ్మయ్య, నిడుదవోలు, వంగూరి సుబ్బారావు, వేటూరి వంటి వారు దీన్ని తమ పీఠికల్లో బలపరిచినారు. చిలుకూరి నారాయణ రావు పండితారాధ్య పీఠికలో సోమన రెండవ రుద్రుని కాలము వాడని వాదము చేసినాడు.

మల్లంపల్లి సోమశేఖర శర్మ గారు మాత్రం (పై నలుగురిని వ్యతిరేకించి) అతనిని ద్వితీయ రుద్రుని కాలమువానిగా నిర్ణయించినాడు. అతడిచ్చిన ఆధారాలలో ఒకటి పిడుపర్తి సోమనాథుని బసవపురాణ కథనాలు. రెండవది నీలగంగవర శాసనం.

**పండితారాధ్యుడు క్రీ.శ.1169–70లో శివైక్యం చెందినప్పుడు ఆ పీఠమును అతని శిష్యుడు దోనయ్య కుమారుడు కేదారయ్య ఎక్కినాడు. ఇతని కుమారులు నలుగురు. 1) మనుమ పండితుడు, 2)భీమనయ్య పండితుడు, 3) మహదేవయ్య, 4) చెన్నవిభుడు. వీరు నలుగురు.**

**'తదీయ కేదార దీశికు గీత చరితు గాదిలి సుత చతుష్కము'** అని తమ సంతానాలతో లోకాలను పునీతం చేస్తున్నారని పాల్కుర్కి చెప్పినాడు. ఇక్కడ పరిశీలించగా 'మనుమ' శబ్దం పౌత్రుడని గాక వ్యక్తి పేరుగా తోస్తోంది. ఇది పేరుగా గలవారు (నెల్లూరి 'మనుమ' సిద్ధి మొదలగువారు) తెలుగునాట ఉన్నారు. అలాగే ముదిగొండ వీరభద్రుని (నూతన కవి సూరన గురువు) వంశంలో 'మనుమ' ఆరాధ్యుడు ఉన్నాడు. కనుక మూడవ తరం అనడం కూడా సమంజసమే.

**శ్రీశైలానికి ఎక్కలేని మల్లికార్జున పండితుడు (క్రీ.శ.1120–1190) వృద్ధుడిగా 80 సంవత్సరాల వయస్సు గలవానిగా భావిస్తే అతని శిష్యుడు సమకాలికుడు అనంతర పీఠాధిపతి ఐన దోనయ్య (1150–1230) కేదారయ్య (1150–1230) (దోనయ్య కుమారుడు, పండితారాధ్యుల పీఠం ఎక్కినవాడు) మనుమ శిష్యుడు పాల్కుర్కి సోమన.**

గణపతి దేవ చక్రవర్తి 'పండితారాధ్యులు కొడుకులకు' (పేరు పేర్కొనకుండా) గ్రామ దానము చేసిన గణపతి దేవుని అమాత్యుడు మల్లన వేయించిన ధర్మసాగరం (వరంగల్ జిల్లా) శాసనం లభిస్తోంది. శాసనకాలం దాంట్లో లేకున్నా నెల్లూరి విజయం (క్రీ.శ.1248 తరువాతది) శాసనం ఉంది. కేదారయ్యకు (1198–1262) బహుశా ఈ దానము చేసినాడు. బహువచనం గౌరవవాచకం.

కనుక పాల్కుర్కి సోమనాథుడు అనేక తరముల తర్వాతివాడు కాక చాలా దగ్గరగా రెండు తరముల తర్వాతి వాడే అగును. అనగా సోమన 12వ శతాబ్దం వాడే అగుచున్నాడు. మొదటి రుద్రుని కాలమున జన్మించి గణపతి దేవుని కాలములో శివైక్యం చెందినాడనవచ్చు.



డాక్టర్ సంగనభట్ల నరసయ్య
94400 73124

(మిగతా వచ్చే వారం)



## ఒక మల్లె పందిరి నీడ

అందరికీ నేను
షాయర్ గానే తెలుసు!

నా పేరు రాజు!
ఆశారాజు!
అంటే..
రాజా హైదరాబాదీ!

నా వెనక చార్మినార్ అందముంది
మిత్రులు కలిసే చోట,
ఇరానీ చాయ్ పొగల పరిమళం ఉన్నది

లీలగా మహా కవి 'మఖ్దూమ్' రాసిన
'ఏక్ చమేలీ కే మండ్వే తలే' పాట వినిపిస్తుంది

జైలు గోడల మీద చెరిగిపోని సంతకం,
'నా తెలంగాణ కోటి రత్నాల వీణ'..
దారెంటా దాశరథి చెదిరిపోని స్వప్నం కనిపిస్తుంది

సారా శెహర్ ముఝే,
షాయర్ కే నామ్ సే జాన్ తా హై!
మై 'పాగల్ షాయర్' హూ!
ప్యార్ కర్ నే వాలా పాగల్ హూ!




ఆశారాజు
93923 02245

---

> **ప్రజల కోసమే పుట్టి, ప్రజల కోసమే బతికి, ప్రజల కోసమే మరణించినవారిని ప్రజలు మరిచిపోతారేమో కానీ, చరిత్రలో వారు సృష్టించుకున్న పేజీలు మాత్రం మరిచిపోలేవు. నిరంతరం వారి త్యాగాలను గుర్తుచేస్తూనే ఉంటాయి. వారు సృష్టించుకున్న చైతన్యదీప్తి ఈ సమాజాన్ని ఎప్పుడూ ముందుకు నడిపిస్తూనే ఉంటుంది. అందుకే చరిత్ర ఈ మహనీయులను ప్రజల మనుషులుగా అభివర్ణిస్తుంది. ఆ విధంగా గుర్తించినవారిలో వట్టికోట ఆళ్వారుస్వామి ముందువరుసలో ఉంటారు.**

# ప్రజల మనిషి వట్టికోట



**'విశ్రాంతి తెలియనివాడు–స్వసుఖం కోరనివాడు వారం వారం మారనివాడు–రంగులద్దుకోలేనివాడు'** అని వట్టికోట ఆళ్వారుస్వామిని కీర్తిస్తూ తన అద్భుతరచన 'అగ్నిధార'ను వట్టికోటకు అంకితమిచ్చారు మహాకవి దాశరథి. అంతేకాదు, కేతవరపు రామకోటి శాస్త్రి తన 'పీహెచ్‌డీ సిద్ధాంత' గ్రంథాన్ని, దాశరథి రంగాచార్య తన 'జనపదం' నవలను అంకితమిచ్చారు.

తెలంగాణ తొలితరం నవలా సాహిత్యకారుడు వట్టికోట ఆళ్వారుస్వామి స్ఫూర్తి, రాష్ట్ర సాధన కోసం సాగిన సాహిత్య, సాంస్కృతిక ఉద్యమంలో కీలక భూమికను పోషించిందని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ 'వట్టికోట'ను ప్రశంసించారు. ఎందరో మహనీయుల ప్రశంసలందుకున్న వట్టికోట 1915 నవంబర్ 1న నల్గొండ జిల్లాలోని చెరువు మాదారం గ్రామంలోని నిరుపేద (సింహాద్రమ్మ– రామచంద్రాచార్య) దంపతులకు జన్మించారు. చిన్నతనంలోనే తండ్రి చనిపోయారు. ఆయన కుటుంబం ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులను ఎదుర్కోవలసి వచ్చింది. కాంచనపల్లి సీతారామారావు అనే ఉపాధ్యాయునికి వండిపెడుతూ వట్టికోట తన చదువును కొనసాగించారు. ఆ తర్వాత గ్రంథాలయాలనే పవిత్ర ఆలయాలుగా భావించిన వట్టికోట నిరంతరం గ్రంథాలయాల్లోనే గ్రంథ పఠనం చేస్తూ సాహిత్య సౌరభాలను ఆఘ్రాణించారు. విజయవాడలో ఒక హోటల్‌లో సర్వర్‌గా పనిచేసినప్పుడు అక్కడి సాహిత్యకారులతో పరిచయం ఏర్పరుచుకున్నారు.

> **ఆ తర్వాత హైదరాబాద్‌కు వచ్చిన వట్టికోట 1936–37లో గోలకొండ పత్రికలో ప్రూఫ్ రీడర్‌గా, ఆ తర్వాత మీజాన్ పత్రికలో ఫ్రీలాన్స్ జర్నలిస్ట్‌గా పనిచేశారు. నిరంతరం ప్రజల శ్రేయస్సు కోసం పరితపించే ఆయనకు ఆంధ్ర మహాసభతో సాన్నిహిత్యం ఏర్పడింది. దాంతో ఆంధ్ర మహాసభ, నల్గొండ శాఖకు అధ్యక్షుడయ్యారు. కమ్యూనిస్టు పార్టీ నాయకుడిగా, స్టేట్ కాంగ్రెస్, ఆర్యసమాజ్ కార్యకర్తగా, అభ్యుదయ రచయితల సంఘం, తెలంగాణ రచయితల సంఘం సభ్యుడిగా నిరంతరం ప్రజల కోసమే జీవించారు.**

ఇక నిజాం వ్యతిరేక పోరాటాల్లో పాల్గొనడంతో ప్రభుత్వ ఆగ్రహానికి గురై జైలు పాలయ్యారు. జైలు లోపల గడిపిన రోజుల్లో అప్పటికే జైల్లో ఉన్న దాశరథితో సాన్నిహిత్యం ఏర్పడింది. జైలు గోడలపై బొగ్గుతో రాసిన దాశరథి కవితలను కంఠస్థం చేసేవారు. జైలు నుంచి విడుదలైన వట్టికోట సమాజ చైతన్యానికి విజ్ఞాన ప్రచారమే సాధనమని భావించారు. అందుకే సికింద్రాబాద్‌లో దేశోద్ధారక గ్రంథమాలను స్థాపించి పలువురు ప్రముఖుల గ్రంథాలను ప్రచురించారు. ఈ గ్రంథమాల సురవరం ప్రతాప రెడ్డి రాసిన 'హైందవ ధర్మవీరులు', 'ప్రాథమిక స్వత్వములు' గ్రంథాలతో సహా 35 గ్రంథాలను ప్రచురించింది. అంతేకాదు ఊరూరా తిరుగుతూ ఈ గ్రంథాలను తక్కువ ధరకే విక్రయించిన వట్టికోట సమాజంలో చైతన్యదీప్తిని ప్రజ్వరిల్లజేశారు. సాహిత్య ప్రచార సారథిగా మాత్రమే కాదు, ఆయన తొలితరం నవలా రచయిత, కథకుడు, సంపాదకుడు, ప్రచురణకర్త కూడా. వట్టికోట కొంతకాలం 'తెలుగు తల్లి' అనే మాసపత్రికను నిర్వహించారు. 'తెలంగాణ' అనే వార్తాపత్రికను కూడా నడిపారు. ఆయన రాసిన 'ప్రజల మనిషి' 1938కి ముందు నిజాం పాలన కింద ఉన్న తెలంగాణ పరిస్థితులకు దర్పణం పడుతుంది. 'జైలు లోపల' అనే కథా సంపుటి తాను జైలులో స్వయంగా దర్శించిన ఖైదీల విభిన్న మనస్తత్వాలను విపులంగా విశదీకరిస్తుంది. ఇక 'గంగు' అసంపూర్ణ నవల 1940–45 మధ్య నిజాంకు వ్యతిరేకంగా జరిగిన సాయుధ పోరాటానికి అద్దం పడుతుంది. 'రామప్ప రభస' వ్యాసాలు సామాజిక సమస్యలను కండ్లెదుట వ్యంగ్యంగా నిలుపుతాయి. అంతేకాదు వట్టికోట 'ధర్మరాజు' అనే కలం పేరుతో కూడా కొన్ని రచనలు చేశారు.

తన జీవితాన్ని ప్రజలకే అంకితం చేసిన ప్రజల మనిషి వట్టికోట ఆళ్వారుస్వామి. 1961, ఫిబ్రవరి 5న దివంగతులయ్యారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం అప్పటి ప్రభుత్వం 2014, నవంబర్ 1న ఆయన శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించింది. అంతేకాదు, హైదరాబాద్‌లోని సిటీ సెంట్రల్ గ్రంథాలయానికి వట్టికోట ఆళ్వారుస్వామి పేరు పెట్టాలని గత ప్రభుత్వం నిర్ణయించడం అభినందనీయం.



బసవరాజు నరేందర్ రావు
98662 95779



## విరామ సమయం..!

నా దేహంలో శక్తి
ఎక్కడికో ఎగిరి అదృశ్యమైపోయింది
తిరిగి పుంజుకోవడానికి
మరికొంత విరామం అవసరమేమో!

జీవితంలో చిట్లిన ఈ శూన్యరోదనల్ని
నిశ్శబ్దంలో విషాద స్మృతులుగా నెమరేసుకుంటూ
ఒంటరిగా కూర్చొని నిట్టూరుస్తున్న మనసు
గతాన్ని వర్తమానంలో తవ్వుకుంటోంది
పక్షులు రెక్కలాడించడం ఆపేశాయి

మా పిట్టగోడపై
నిత్యం ప్రత్యక్షమయ్యే కాకి
ఎందుకో వాలడం మానేసింది
మా ఇంటి ముందు
వీధి లైటు కింద
మూడు రోజుల్నుండి
కుక్క అన్నం తినడం మానేసింది

నా కలల అడుగుల్ని కట్టడి చేస్తూ
మంచానికే నన్నిలా పరిమితం చేస్తుంటే,
కంటి చెమ్మతో తుడిచే మాటలు
నా పక్కనే వాలుతూ విషాదంతో జోకొడుతున్నాయి

నిజం చెప్పాలంటే
నేనిప్పుడు
నా శరీరంతో యుద్ధం చేస్తున్నాను
నా దేహపు వాకిలిని
చీపురుతో శుభ్రం చేసే లేపనాన్ని పూయాలి

ఈ క్షణంలో
నా స్నేహితులే నా గది గోడలు
సుదూర తీరంలో ఉన్నా
'నువ్వెలా ఉన్నావంటూ' అమ్మ చేసే
ఆత్మీయ పలకరింపు కన్నా
నాకిప్పుడేం కావాలి

కష్టకాలంలో మనుషుల్ని
ప్రేమించే మనసులుంటే
ఓదార్పును మించిన
ఆత్మీయబంధం ఇంకేముంటుంది
వీలైనంత తొందర్లో
ఈ నేలతో మళ్లీ యుద్ధం చేస్తాను

ప్రకృతి గాలి ఔషధమై
నాలో కొత్త ఊపిరిని నింపుతుంటే,
బతుకు రెక్కల్తో స్వేచ్ఛగా
మళ్లీ ఎగిరిపోయే రోజులొస్తాయ్

ప్రస్తుతానికి
ఇదొక విరామం మాత్రమే
కొన ఊపిరి మిగిలినంత వరకూ
నా అడుగుల చప్పుడు
యుద్ధం రూపంలో మొదలవుతుందేమో!



ఎన్.లహరి
98855 35506

### సంస్మరణ సభ

'హైదరాబాద్ కవుల వేదిక' ఆధ్వర్యంలో 2024, అక్టోబర్ 30వ తేదీ బుధవారం రోజున సాయంత్రం 6 గంటలకు వనస్థలిపురం, విజయశ్రీకాలనీ కమ్యూనిటీ హాల్‌లో దివంగత కవి, రచయిత డాక్టర్ మండల స్వామి సంస్మరణ సభ జరుగనున్నది. సమావేశంలో స్వామి రాసిన కవిత్వ పఠనం ఉంటుంది. మిత్రులందరికీ ఆహ్వానం.

**- ఏనుగు నరసింహారెడ్డి, 89788 69183**

### కవి సమ్మేళనం

**తెలంగాణ** రచయితల సంఘం జంట నగరాలు, తెలంగాణ భాషా సంస్కృతి శాఖ సంయుక్త నిర్వహణలో 2024, నవంబర్ 3వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు రవీంద్రభారతిలో 'కవి వారం–కవిత్వ తరగతి' కవి సమ్మేళనం జరుగనున్నది.

**- కందుకూరి శ్రీరాములు**

### అధ్యయన శిబిరం

**తెలంగాణ** సారస్వత షరిషత్తు ఆధ్వర్యంలో 2024, నవంబర్ 24వ తేదీ ఆదివారం రోజున వచన కవిత్వ అధ్యయన శిబిరం జరుగనున్నది. ఇప్పటికే కవిత్వరంగంలో కొంత కృషిచేసిన వారికి వస్తు, శిల్పపరమైన శిక్షణ ఇచ్చేందుకుగాను ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నాం. కవులు ఇప్పటివరకు వెలువరించిన కవితల వివరాలు తెలియజేస్తూ మచ్చుకు ఒక కవితను 9603727234 వాట్సప్ నెంబర్‌కు పంపి నమోదు చేసుకోవాలి. ఈ శిబిరంలో కవిత్వ నిర్మాణ పద్ధతుల గురించి, కవిత్వంలో ఉండవలసిన ప్రామాణిక అంశాల గురించి.. కవులు, విమర్శకులు వివరిస్తారు.

**- డాక్టర్ జె.చెన్నయ్య**

# ఆయన యాది ఎట్ల మరుస్తం...?

**'నూలు బట్టలు కట్టుకుంటే నేల మీద కూర్చున్నా ఏమనిపించదు. పీతాంబరం కట్టుకుంటేనే పీట అవసరం'... ఇలా చెప్పడమే కాదు, బతికున్నన్నాళ్లూ నూలు బట్టలు కట్టుకున్న ఆ పండితుడిని ఎలా మరచిపోతాం. సంగీత, సాహిత్య నిధి సామల సదాశివ గారిని యాది చేసుకోకుండా ఎలా ఉంటాం.**



**గట్లుంటది..**

సాహిత్యం సరే, సంగీతం గురించి మన బండబుర్రలకు అర్థమయ్యేలా చెప్పేవారేరీ ఆయన ముందు కానీ, ఆ తర్వాత కానీ. అందుకే, ఈ సామల సదాశివ గారంటే తల్లావఝుల శివశంకర శాస్త్రి గారు ప్రాణం పెట్టేవారు. అప్పటికి సదాశివ గారు చిన్నపిల్లాడు కదా. 'మా ఊరు ఆదిలాబాద్ మీ అందరికీ దూరం. అందుకే మీరెవ్వరూ మా ఊరు రారు. ఒక్కసారి రాండ్రి. ఎంత బాగా చూసుకుంటామో తెలుస్తది' అంటూ తల్లావఝుల వారు, విశ్వనాథలతో పాటు పెద్దల ముందు కాసింత అలక ప్రదర్శించారు సదాశివ గారు. 'అది కాదులే నాన్నా. ఈసారి సాహిత్య సమావేశం పెట్టు. మేం వస్తాం' అని సదాశివ గారికి ప్రేమగా హామీ ఇవ్వడమే కాదు, వెళ్లారు కూడా అనేకమంది ప్రముఖులు. తనకు గుర్తున్న సంగతులు, చూసిన, చదివిన, అనుభవించిన అనేక విషయాలన్నీ కలిపి 'యాది' అంటూ పుస్తకం వేస్తే ఆ కవర్ పేజీ మీద ఏదో ఆలోచనలో ఉన్న సదాశివ గారి కాళ్ల దగ్గర ఓ కుర్రాడు చాలా శ్రద్ధగా, వొద్దిగ్గా కూర్చునుంటాడు. ఆయన ఏం చెప్తారో విందామనే ఆరాటం కనిపిస్తుంది ఆ కుర్రాడిలో. ఇంతకీ ఆ కుర్రాడెవరో తెలుసా... తెలుగు పాఠకులే. సంగీతాభిమానులే. సాహిత్య ప్రేమికులే. గజళ్లకు, ఉర్దూ కవిత్వానికి ఆయన చేసే అనువాదాలు చదువుదామనే ఆశ ఆ కవర్ పేజీ మీద కనిపిస్తుంది. ఈ కవర్ పేజీ బొమ్మ వేసింది ఆర్టిస్టు చంద్రే కానీ ఆ బొమ్మ నిండా ఆనాటి తెలుగు పాఠకులే ఒక్కరై కూర్చున్నారనిపిస్తుంది.

> **కురుక్షేత్రం నాటకంలోనో, రాయబారంలోనో, సత్యహరిశ్చంద్ర కాటి సీనులోనో నటీ నటులు పలికే పదాల చివర వచ్చే ఆలాపనలు వినే ఉంటారు కదా... ఆ రాగాలాపనలకు మూలం ఉత్తరాది అని... మరీ ముఖ్యంగా మహరాష్ట్ర సంప్రదాయం అని రుజువులతో సహా చెప్పింది ఈ సామల సదాశివ గారే. ఇంతేకాదు... సంగీత కచేరీల్లో పక్క వాయిద్యాల గురించి పెద్దగా చర్చించుకోని సమయంలో వాటి పుట్టుక, జన్మస్థలం ఇదర్రా అని చెప్పింది ఈ మహా పండితుడు సామల సదాశివ గారే.**

గజల్స్ విన్నాం కదా... ఆ ఉర్దూ గజల్స్‌ని తెలుగు వారికి పరిచయం చేసింది తొట్టతొలుత సదాశివ గారేనని, ఆయన చెప్పేవరకూ ప్రాచీన సంగీతం గురించి పెద్దగా తెలిసినవారు లేరని నాకు ఆధారాలు చూపిస్తూ వివరించింది మరో పండితుడు బూదరాజు రాధాకృష్ణ గారు. నిజాం నవాబుకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ పోరాట సమయంలో బయట ఏం జరుగుతుందో ఉద్యమకారులు తెలుసుకునేందుకు వీలుగా ప్రత్యేకంగా రేడియో రూపొందించిన బృందంలో ఉన్నదీ ఈ సామల సదాశివ గారే.

"Dear Friend తొందర్లో ఏదో రాసినాను. ఏమీ అనుకోకండి అంటూ సదాశివ గారికి ఓ కార్డు వచ్చింది. ఇలా రాసింది ఎవరో కాదు... విశ్వనాథ సత్యనారాయణ. దీనికి కారణం ఏం లేదు. విశ్వనాథ గారి గురించి రాసిన ఓ వ్యాసానికి ఫొటో పంపమని సదాశివ గారు కార్డు రాస్తే... 'మీరు ఏం రాస్తారో.. ఎందులో రాస్తారో.. నాకు మాత్రం ఈ ఫొటో పంపడానికి కొంత ఖర్చు అయ్యింది' అంటూ విశ్వనాథ వారు ఆ ఫొటో వెనుక రాసి పంపారు. ఆ జాబుకు సదాశివ గారు చాలా సౌమ్యంగా రాసిన ఉత్తరం, ఆ తదుపరి విశ్వనాథ గురించి రాసిన వ్యాసం చదివి ఇలా ఏమి అనుకోకండి' అని... పైగా "Dear Friend" అని సంబోధిస్తూ రాసిన ప్రత్యుత్తరం అది. విశ్వనాథగారు రాసిన 'ఆ ఏమి అనుకోకండి' అంటూ రాసిన ఉత్తరం వెనుక ఉన్నది సదాశివ గారి ఎదుగుదలే కాదు... ఆయన వొదుగుదల కూడా. సామల సదాశివ గారిని యాది చేసుకోవడమంటే ఆనాటి తరాన్నే కాదు, అప్పటి అనుబంధాలను గుర్తు చేసుకోవడమే.



ముక్కామల చక్రధర్
99120 19929